కథానిక

# గూడూ - ఆకాశం

"వసంత"

లోకంలో వింత వింత మనుష్యులుంటారు. వాళ్లూ న్యాయానికి అందరిమల్లేనే జీవిస్తారు. కాని వాళ్ళమటుకు తమలో తాము భిన్న జీవితాన్ని భావిస్తూ తీరని తీయని కలలు కంటూ వుంటారు. వాళ్ళకి వాస్తవంగా ఫలానాది కావాలి అనే విషయం ఇతమిద్ధంగా తెలీదు. దేనికోసమో ఎప్పుడూ అసంతృప్తిగా వ్యథ పడుతూ జీవిస్తారు. పాపం అటువంటి వ్యక్తి తన విషయాలేమన్నా పైకి ఎవరితోనన్నా పొరపాటున చెప్పాడా, అవి చాలా అసందర్భంగానూ, అతిస్వల్పమైన విలువ గలిగినవిగానూ కనబడతాయి. ఇలా అనుకుంటున్నట్లు అతనికి తెలిస్తే నిలువునా నీరయిపోతాడు. అటువంటి వాళ్ళల్లో ఒకరకం మన చక్రపాణి.

చక్రపాణి చిన్నతనం నుంచీ జీవితాన్ని ఎంతో మధురంగా వూహించుకున్నాడు. అతడి జీవితం ఇంతవరకూ క్షుణ్ణంగా తెలిసిన వాళ్ళకు ఆ మాధుర్యం ఏకోశానా గోచరించదు. అయినప్పటికీ ఇంకా అలాగే తియ్యగా బ్రతుకును గూర్చి ఆలోచిస్తూనే వుంటాడు చక్రపాణి

అతనికి గ్రాహ్యం వచ్చాక మూడు పొద్దుల అప్పులవాళ్ళు ఇంటిని జప్తు చేశారు. ఏపూటకా పూట అన్నం తింటారో లేదో అన్నట్లుగా సంసారం గడిచిన రోజులున్నాయి. ఎలాగో ఓలాగు హైస్కూలు చదువు పూర్తిచేశాడు. తండ్రి పట్టుదలమీద కాలేజీలో చేరాడు. తండ్రి నెలకు రెండువందల రూపాయల జీతగాడు. అందువలనే చక్రపాణికి తన నిజస్థితి అర్థం కాలేదు. ఎప్పటికప్పుడే తన తండ్రి హోదా మనస్సులో వుంచుకుని తన జీవితాన్ని గొప్పగా వూహించుకోకుండా వుండలేక పోయేవాడు. ఏ పెద్దడాక్టరు పరీక్షో చదివేసి దేశభక్తుడై దేశానికి పెద్ద సేవ చేయగలను అనే భావన, అతన్ని ఒకపట్టున వొదిలిపెట్టేదికాదు. ఇంతకీ విషయమేమిటంటే చక్రపాణి ఇంటర్‌లోనే తప్పి కూర్చున్నాడు అతగాడి మధుర స్వప్నం మొదటిసారిగానే దెబ్బతిన్నది.

చక్రపాణి భార్య కాపరానికి వచ్చింది. అన్నివిధాలా తగిన ఇల్లాలే అనసూయ చక్రపాణికి. లోకం హర్షించింది వాళ్ళ దాంపత్యానికి. చక్రపాణికూడా హర్షించాడు. భార్యంటే చక్రపాణికి ఎంతో ప్రేమని అనేవాళ్ళు అందరూ. ఆ విషయం అనసూయే చెప్పింది స్వయంగా తన స్నేహితురాళ్ళతో. కాని చక్రపాణికి తను భార్యను ప్రేమిస్తున్నదీ లేనిదీ అర్థం గాలేదు. మొత్తంమీద రోజులు సక్రమంగానే ఏవిధమైన లోపమూ లేకుండా వాళ్ళకు గడిచాయి. చక్రపాణి హృదయం మటుకు మధుర లోకంలో విహరిస్తూనే వుంది. తను దేశభక్తుడౌదామనుకున్నాడు. కాని తండ్రిజబ్బుతో సంసారం తనమీద పడ్డది దీనికి తోడు తన భార్యా తన సంసారం ఆఫీసు, ఇల్లు ఇదే లోకమైపోయింది చక్రపాణికి. కాని మొత్తం మీద లోటు ఎక్కడో వున్నదన్న విషయం వేధించ సాగింది అతగాణ్ణి. తీరా ఆలోచిస్తే అది అనసూయలో ఉన్నట్లు సవ్వడి అయింది. అనసూయ దగ్గర్నించి తన కేమిటో కావాలి. ఆ ముగ్ధ తను ప్రాణ భర్తకు ఇవ్వగల్గింది ప్రేమతో హృదయపూర్వకంగా అర్పిస్తోంది. ఊహూం, ఏదో ఇంకా వుంది అనసూయ ప్రేమను చేతల్లో వ్యక్తంచేసే నైజాంగల వ్యక్తి. మాటల్లో తన ప్రేమను చిత్రించి అతణ్ని రంజింప చేయలేదు. బహుశా ఇదే కారణం అయివుండొచ్చునేమో అనిపించింది చక్రపాణికి.

అనసూయ అకస్మాత్తుగా జబ్బుచేసి కళ్ళు మూసింది శాశ్వతంగా. చక్రపాణి జీవితంలో ఆశాకుసుమం వాడి తడిసి ఎండి రాలిపోయింది. మధురస్వప్నం కరిగి నీరై పోయింది. అంతవరకూ అతనికి తెలీకుండా హృదయాకాశంలో తెలి మబ్బురూపంలో తేలియాడే గాఢానురాగాలు

ద్రవించి ఒక్కసారిగా ప్రేమవాహినులు ఘనీభవించి బాధా జనకమయాయి. అవాస్తవిక భావాలలో, ఆ మూల్య వాస్తవిక మధుర క్షణాల్ని వ్యర్థపుచ్చానన్న బాధ హృదయాన్ని పట్టి పిండింది. అనసూయ లేని జీవితమే దుర్భరమనిపించింది. కొన్నాళ్ళదాకా వెర్రివాడిలా మనస్సుని వైరాగ్యపథాలలో పట్టి నెట్టాడు. గంపసంసారం బాధ్యత ఎన్నాళ్లో అతని నట్లా స్వేచ్ఛగా వైరాగ్యాన్ని జీర్ణించుకోనివ్వలేదు. అస్తమించిన ఆశాకిరణం జాడనే శూన్యదృక్కులు సాగిస్తూ లౌకికప్రపంచంలో వ్యక్తిబాధ్యతల్ని నిర్వర్తించడానికి పూనుకున్నాడు.

ఎంతో కాలం ఇలా సారంలేని జీవితాన్ని గడపడం అంటే భయమేసింది చక్రపాణికి. మళ్ళీ జీవితాన్ని మధురంగా భావించటం అనే అతని సహజలక్షణం తలెత్తింది. వెన్వెంటనే వెన్నుమీద ఏదో మరువరాని స్మృతి గుచ్చినట్లయింది. కాని కాలప్రవాహంలో ఎట్టి స్మృతులయినా కరిగి, పలుచనై ఒక్కొక్కప్పుడు అదృశ్యమవటంకూడా సంభవించటం తప్పదు.

చక్రపాణి ఒంటరితనంలోనే పోదా, దానితోపాటు ధనం సంపాదించుకున్నాడు. ఈ మార్పుతోబాటు అతడి జీవితంలో కూలంకషమైన మార్పు వచ్చింది. ఎవరితోనైనా సంభాషణలో దిగితే, ఒడలు మరిచి ఉత్సాహంతో ప్రఫుల్ల వదనుడై భాషించేవాడు. కాని నేడు అది అంతా మూగవోయింది. ముక్తసరిగా మాట్లాడుతాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ యథాలాపంగా వుంటాడు. మాట్లాడేది కొద్ది ముక్కలైనా అతి వాస్తవికంగా ఎదుటి హృదయాల్ని పట్టి గిలకరించినట్లౌతుంది. అందుకనే ఇవికూడా పూర్వంమాదిరిగానే లోకమర్యాదను పొందలేక పోతున్నాయి. కాని ఒకటి భేదం. పైకి అనటానికి ధైర్యం చాలకపోయినా ఎవడికి వాడు ఇందులోని విలువను గుర్తించకతప్పలేదు.

కొన్ని పరిస్థితుల ప్రభావమే కారణం చక్రపాణి ప్రభావతి పాణిని గ్రహించటానికి. పరిస్థితులే కాదు. చక్రపాణి ప్రభావతిలో ఉన్న ఆదర్శాల కోసం తాను భయపడకుండా నిశ్చింతమైన సహకారజీవితాన్ని వాస్తవిక దృష్టితో జీవిద్దామని ఆశించాడు. కాని చక్రపాణిని పిటీ చెయ్యవలసిందేమంటే అతని అవ్యక్త మధుర స్వప్నాలు, ఆకాంక్షలు, ఆశాలతలు ప్రభావతిని నిండుగా ఆవరించాయి. కేవలం విధిప్రభావం. ఆ ఎలనాగకు చక్రపాణి పూర్వాశ్రమ లక్ష్యాలు, భావాలు ఏమి తెలుసు! తన సహజ లక్షణాల్ని ప్రబలంగా వృద్ధి చేసుకుంది. విద్యాధికురాలు సహజంగా నవచైతన్యాన్ని చవిచూడాలని వాంఛిస్తుంది. జీవితాన్ని కళాదృష్టితో జీవించాలంటుంది ప్రభావతి. చక్రపాణితో తన జీవితాన్ని తను వూహించుకోలేనంత మధురంగా జీవించాలని తలపోసింది. ఇలా ఉన్నత పథాల్లో విహరించే ప్రభావతి చక్రపాణికి ఆకడిపుడాసించే వాస్తవిక గృహిణి కాలేక పోయింది.

ఒకరోజు చక్రపాణి తనగదిలో ఏదో చదువుకుంటున్నాడు. ప్రభావతి అతణ్ణి సమీపించి 'ఏమండీ ఈవాళ మంచి సినిమా వచ్చింది. వెళ్దాం.' అంది.

'వాళ్ళ కమలా నీవూ వెళ్ళిరండి.'

ప్రభావతి అనుకుంటున్న విధంగా క్రుంగిపోయింది. కాని మళ్ళీ ధైర్యం చిక్కబెట్టుకుని మెల్లగా అతని భుజాలమీదనుంచి చెంపలు తాకుతూ'—'అయితే మీరు రారా!' అంది.

'తర్వాత మళ్ళీ వెళ్దాంలే ప్రభా.'

'ఇది ఎన్నోసారో చెప్పండి మీరిలా చెప్పి తప్పించుకోవటం' అంటూ అతని తల పైకెత్తి అతని కళ్ళలోకి చూస్తూ అంది. ప్రభ నేత్రాలు చెమ్మగిల్లటం చక్రపాణి చూడక పోలేదు.

'అయితే వెళ్దాం' అన్నాడు మెల్లిగా. ప్రభావతి పట్టలేని ఆనందంతో అతడి పెదిమలు తన వాటితో కలిపింది. మరుక్షణంలో హృదయాంతరాళంలో అవ్యక్తమైన అసంతృప్తి పొడచూపినట్లయింది. రియాక్షన్ లేని ఆశ్చర్యంలో పరిపూర్ణ సంతోష స్వాంతురాలు కాలేక పోయింది తను వూహించుకున్నంత మధురఘట్టం కాలేక పోయింది. సినిమాకు వెళ్ళివచ్చిన నాటి రాత్రి ప్రభ చక్రపాణి ప్రేమాలింగనంలో మైమరచి సుఖ నిద్ర చెందింది.

మళ్ళీ మర్నాడు చక్రపాణి శూన్యదృక్కులు, గంభీరమాన ముద్ర, భరింపరాని వయ్యాయి, తన అవ్యక్త మధురిమల్లో కొట్టుమిట్టాడక తప్పింది కాదు ప్రభావతికి.